క్లుప్తంగా

బీసీ ద్రోహులకు గుణపాఠం తప్పదు



హస్మత్‌పేట్ చౌరస్తాలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: బీసీ రిజర్వేషన్ల అమలుకు అడ్డుపడ్డ వారికి రాజకీయ సమాధి తప్పదని తెలంగాణ బలహీన వర్గాల సమితి బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గే శ్రీనివాస్ పటేల్ అన్నారు. బోయిన్‌పల్లిలోని హస్మత్‌పేట్‌లో రాష్ట్ర బంద్‌లో భాగంగా బంద్ నిర్వహించి బీసీ ద్రోహుల దిష్టిబొమ్మను అంబేడ్కర్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ద్వారా బీసీలకు రావాల్సిన రిజర్వేషన్లను సాధించేవరకు పోరాటం ఆగేది లేదన్నారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం తప్పదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్లు కటికం మహేష్ కుమార్, బత్తుల రాములు, అమరం శ్యాం కుమార్, ఆత్మకూరి సురేష్, దడిగే రాములు, శివకుమార్, బాలేష్ ముదిరాజ్, సందీప్ గౌడ్, బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి హరిహర క్షేత్రంలో కార్తీకమాసోత్సవ పూజలు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీ హరిహర క్షేత్రంలో కార్తీకమాసోత్సవ ప్రత్యేక పూజలు ఈ నెల 22 నుంచి నవంబర్ 20 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణ సూరి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 27న మొదటి సోమవారం సందర్భంగా ఉదయం 4 నుంచి ప్రత్యేక అభిషేకాలు, నవంబర్ 2న ఉదయం 9 గంటలకు దాసాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల అర్చన, 3న అభిషేకాలు, 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం ప్రత్యేక అభిషేకాలు, సత్యనారాయణ స్వామి వ్రతం, సాయంత్రం 6 గంటలకు లక్ష దీపారాధన మహోత్సవం, 8న సంకష్ట హర చతుర్థి సందర్భంగా లక్ష్మీ గణపతికి పంచామృతాభిషేకం, 9న లక్ష బిల్వార్చన, 10న 3వ సోమవారం అభిషేకాలు, సాయంత్రం కోదండరామ చంద్ర స్వామి కల్యాణోత్సవం, 17న 4వ సోమవారం అభిషేకాలు, 18న మాస శివరాత్రి సందర్భంగా కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, వన భోజనాలు, 19న సాయంత్రం 5 గంటలకు నంది వాహన సేవ రథోత్సవం ఉంటుందని ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

నేడు రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం, మెనోపాజ్ ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సీఈఓ యోబు ఓ ప్రకటనలో తెలిపారు. నేషన్స్ బెనిఫిట్స్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో గైనకాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, యోగా థెరపిస్ట్, ఫిజియో థెరపిస్ట్, ఆర్థోపెడిషన్, కార్డియాలజిస్ట్ నిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ శిబిరంలో సీబీపీ, సీఏయూ, ఛాతి ఎక్స్‌రే, ఈసీజీ, 2డీ ఏకో, అల్ట్రాసౌండ్, విటమిన్ బీ 12, డీ, డయాబెటిక్, న్యూరోపతి ఎసెస్‌మెంట్ తదితర పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు.

భూ వివాదం.. అడ్వకేట్‌పై దాడి

- తన భూమిలో నిర్మాణాలపై ప్రశ్నించిన బాధితుడు



ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్ పరిధిలోని సర్వే నెంబర్ ఒకటిలో నెలకొన్న భూ వివాదంలో బాధితుడు అడ్వకేట్ మొయిజుద్దీన్ ఖాన్ పై దాడి చేశారు. ఈ ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితుడి వివరాల ప్రకారం.. హస్మత్‌పేట్ సర్వే నెంబర్ 1 వద్ద ఛత్రిగడ్డ స్థలంలో అడ్వకేట్ మొయిజుద్దీన్ ఖాన్ పేరిట స్థలం ఉంది. అందులో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారన్న సమాచారంతో అడిగేందుకు వెళ్లిన మొయిజుద్దీన్ ఖాన్‌ను దుర్భాషలాడుతూ ఆయనపై చేయి చేసుకున్నారు. ఈ ఘర్షణలో అతడికి గాయాలయ్యాయి. అతడి కారు అద్దాలను సైతం పగలగొట్టారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్యం.. అస్తవ్యస్తం!

ఖాళీ ప్రాంతంలో చెత్త డంప్

- పేరుకుపోయి కంపు కొడుతున్న పరిసరాలు
- పట్టించుకోని అధికారులు

> రోజు రోజుకు పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారవుతుంది. నగరంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పట్టణ ప్రగతి లక్ష్యం నీరుగారిపోతుంది. ఎవరికి వారు తగిన చర్యలు తీసుకోకపోవడంతో ఖాళీ ప్రదేశాలు చెత్త డంపింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి. దీంతో దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



అంజయ్యనగర్‌లో పేరుకుపోయిన చెత్త కుప్పలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్, హస్మత్‌పేట ప్రాంతాలలోని రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలాలలో చెత్తను వేస్తున్నారు. ఆయా ప్రాంతాలు అస్తవ్యస్తంగా మారి చెత్తతో కంపుకొడుతున్నాయి. పందులు చెత్తను చిందర వందర చేస్తుండటంతో ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. హస్మత్‌పేట నుంచి ఓల్డ్ బోయిన్‌పల్లి వెళ్లే ప్రధాన రహదారి ఏర్పాటు చేసిన మూడు డస్ట్‌బిన్లు నిండిపోయి కింద పడుతున్నాయి. హస్మత్‌పేటలోని మోడల్ మార్కెట్ ముందు రోడ్డుపైనే చెత్త వేస్తుండటంతో ఆ ప్రాంత ప్రజలకు దుర్వాసన తప్పడం లేదు. డివిజన్‌లోని హస్మత్‌పేట, అంజయ్యనగర్, హరిజన బస్తీ, కోయబస్తీ, ఎల్‌బీనగర్ వంటి పలు ప్రాంతాలలో కొన్ని రోజులుగా చెత్తను తొలగించడంలేదు. దీంతో పరిసర ప్రాంతాలు చెత్తమయంగా దర్శనమిస్తున్నాయి.

రోగాల బారిన ప్రజలు

రహదారులు, బస్తీలలో చెత్త కుండీలను తొలగించడంతో ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ పారబోస్తున్నారు. దారి వెంట చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులు చెత్త వేసే ప్రాంతాలను గుర్తించి ముగ్గులు వేసి అవగాహన కల్పించారు. ఇప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను తొలగించకపోవడంతో కుప్పలుగా పేరుకుపోతున్నాయి. దీంతో రోగాలు ప్రబలే అవకాశముంది. చెత్త తరలింపులో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కిందిస్థాయిలో సరిగా పని చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.





హస్మత్‌పేట నుంచి ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తా ప్రధాన రహదారిలో..

ముగిసిన ఆలయ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: స్వాన్‌లేక్ గేటెడ్ కమ్యూనిటిలో శ్రీ వరసిద్ధి వినాయక ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. హోమాలు, పండిత ఆశీర్వచనాలు, అన్న ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులను స్వాన్‌లేక్ గేటెడ్ కమ్యూనిటీ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు శ్రావణ్‌కుమార్, బాబురావు, ఆలయ కమిటీ సభ్యులు మల్లారు కృష్ణమూర్తి, చోళ రాఖేశ్వర్ రావు, డీడీ రెడ్డి, శైలేష్ తివారి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ గౌతంనగర్‌లో శుక్రవారం అరబ్బా బాబా దర్గా ఉర్సులో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పాల్గొని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సలావుద్దీన్, జహీర్, ఇమ్రాన్, అబ్దుల్ మాలిక్, సుదర్శన్ రెడ్డి, కరుణాకర్, సురేందర్ నాయుడు పాల్గొన్నారు.



ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్ గౌడ్

ఘనంగా 'అట్లతద్ది'

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట పార్కులో కిందికుంట పార్కు వాకర్స్ అసోసియేషన్, చుట్టు పక్కల కాలనీ మహిళల ఆధ్వర్యంలో శుక్రవారం అట్లతద్ది కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ పురాణాల్లో అట్లతద్ది పండుగకి విశేషమైన ప్రాధాన్యం ఉందన్నారు. ఆశ్వయుజ బహుళ తదియ నాడు ఈ అట్లతద్ది జరుపుకుంటారని తెలిపారు. దీనినే ఉయ్యాల పండుగ అని, గోరింటాకు పండుగ అని కూడా అంటారని వివరించారు.



కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక మహిళలు

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

చందానగర్ : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని యూనిసెంట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మనోజాగృతి సంస్థ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. డాక్టర్ గీత చల్లా నాయకత్వంలో ఇంటర్నేషనల్ స్కూల్‌లో 101 మంది శిక్షణ పొందిన పీర్ కౌన్సిలర్లు, 101 మంది ప్రొఫెషనల్ కౌన్సిలర్ల పర్యవేక్షణలో 101 మంది విద్యార్థులకు మానసిక సమస్యలపై ప్రథమ చికిత్స అందించారు. అనంతరం డాక్టర్ గీత మాట్లాడుతూ మన దేశంలో పీర్ కౌన్సిలర్లు, సైకలాజికల్ ఫస్ట్ ఎయిడ్ యొక్క అవశ్యకత ఉందన్నారు. వరల్డ్ రికార్డ్ యూనియన్ అధికారిక రికార్డు అధికారి షరీఫా హనీఫ్, డాక్టర్ ఆశా, యూనిసెంట్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ కోసూరు సునీల్ కుమార్, ప్రిన్సిపల్ కామేశ్వరి, డాక్టర్ వెంకటసుబ్బయ్య చెన్నంశెట్టి, రాధిక, డాక్టర్ మమత రఘువీర్ ఆచంట, ప్రముఖులు, మనోజ రితి సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో పాటల పోటీలు



పాటల పోటీలో ప్రశంసాపత్రాలను అందుకున్న విద్యార్థులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని భారత్ వికాస్ పరిషత్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ పాటల పోటీలో 33 పాఠశాలల నుంచి మొత్తం 792 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలుగు జానపద పాటలు, హిందీ దేశభక్తి పాటలు, సంస్కృత, సాంప్రదాయ పాటలు, వందేమాతరం అనే విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని భారత్ వికాస్ పరిషత్ ముఖ్య సలహాదారు సీహెచ్. హనుమంతరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. జలవేందర్‌రావు, అనిల్‌కుమార్, ఎన్‌జీఎస్‌సీ కన్వీనర్ శివరాత్రి యాదగిరి, రాష్ట్ర కో కన్వీనర్ సదాశివ్ రెడ్డి సమక్షంలో పోటీలు జరిగాయి. యువ విద్యార్థులు తమ సంగీత ప్రతిభను ప్రదర్శించారు. దేశం పట్ల తమ ప్రేమను ఈ ప్రదర్శనలో వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆఫీస్ బేరర్లు సుబ్రహ్మణ్యం, సుకృత్‌కుమార్, బీఎస్‌ఎన్ మూర్తి, సుబ్బారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భారత్ వికాస్ పరిషత్ ముఖ్య సలహాదారు హనుమంతరావు

ఇందిరమ్మ క్యాంటిన్‌లో రుచికర భోజనం



భోజనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ క్యాంటిన్‌లో పేదలకు అందుతున్న భోజనం నాణ్యత, రుచిని అందిస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పలువురు కాంగ్రెస్ నేతలు క్యాంటిన్‌ను సందర్శించి భోజనం చేశారు. కార్యక్రమంలో కరుణాకర్ నాయుడు, తమ్మినని ప్రవీణ్‌కుమార్, కృష్ణ రాజ్‌పుత్, మేకల మైకేల్, ఏఎంసీ డైరెక్టర్ ఫణీంద్ర, డివిజన్ సీనియర్ నాయకులు రాజేష్‌గౌడ్, కృష్ణారెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'ఇబ్టిడా-2025'

రాయదుర్గం: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికే 'ఇబ్టిడా' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ క్యాంపస్‌లో ఇంటర్ కాలేజ్ ఫెస్ట్ 'ఇబ్టిడా–2025' పేరిట నిర్వహించిన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను అందించారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు జ్ఞాపిక ఇస్తున్న ఈడీ తేజ్‌లోహిత్‌రెడ్డి

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్

నిజాంపేట్ : పోరాటాలతో సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్ అన్నారు. శుక్రవారం సీఐటీయూ బాచుపల్లి మండలం నాలుగో మహాసభలు ప్రగతినగర్ సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో అనేక కార్మిక అనుకూల చట్టాలు సాధించటానికి సీఐటీయూ తనవంతు బాధ్యతగా నిరంతరాయంగా కృషి చేసిందన్నారు. రానున్న కాలంలో ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. పోరాటాల్లో కార్మికులు పెద్ద ఎత్తున భాగస్వాములవ్వాలన్నారు. ఎన్నికైన నూతన కమిటీ కార్మికులకు కనీస వేతనాలు, కాంట్రాక్టు కార్మికుల పర్మినెంట్ కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతన కమిటీని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్ ప్రకటించారు. సమన్వయ కమిటీ కన్వీనర్‌గా ఆర్.సంతోష్, కమిటీ సభ్యులుగా పి.పెంటయ్య, ఎల్లమ్మ, శ్రీనివాస్, నాగలక్ష్మి, అంజి, కె.లక్ష్మి, పి.లక్ష్మి, మున్సిపల్ రంగం, భాగ్యలక్ష్మి, సోనీ అంగన్‌వాడీ రంగం, మీనా, వెంకటేశ్వరి ఆశా రంగం, ఎం.నరసింహ, బాబు నాయక్ ఆటో రంగం, రమేష్, విశ్వనాథ్ ఆటో ట్రాలీ, భాస్కర్, సతీష్ బీసీడబ్ల్యూ, పి.స్వామి స్ట్రీట్ వండర్స్ నుంచి ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు బి.వెంకటరామయ్య, ఎం.చంద్రశేఖర్, ఎం.శంకర్, బాల వెంకటేశ్వరరావు, బాల స్వామి, చెన్నయ్య, సత్యనారాయణ, వెంకన్న, శ్రీను, మనీ, లక్ష్మి, పద్మ, వెంకటమ్మ, రత్నం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు



సమావేశానికి హాజరైన కార్మికులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



రాయదుర్గం నాగార్జున ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయదుర్గం: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో బాటు ఇతరులకు అవగాహన కల్పించాలని రాయదుర్గం ట్రాఫిక్ పోలీసులు సూచించారు. రాయదుర్గం ట్రాఫిక్ ఆర్ ఎస్ఐ సత్యనారాయణ, ఏఎస్ఐ ఉస్మాన్ శుక్రవారం రాయదుర్గం నాగార్జున ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సిగ్నల్ ప్రాముఖ్యతను వివరించారు. పాదచారుల దాటే మార్గాలు, ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ పొందే విధానంపై అవగాహన కల్పించారు. రాయదుర్గం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని విద్యాసంస్థలలో అవగాహన కార్యక్రమాలను దశలవారీగా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో రాయదుర్గం పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం!

- ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు పగుళ్లు
- ఎప్పుడైనా కూలిపోయే అవకాశం

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ ప్రగతినగర్‌లోని రోడ్డు నెంబర్ 4లో, సీనియర్ సిటిజన్ భవనం పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ప్రమాదకరంగా ఉంది. దిమ్మెకు పగుళ్లు ఏర్పడి ఏ క్షణమైనా ట్రాన్స్‌ఫార్మర్ కిందపడే అవకాశం ఉంది. అంతేగాకుండా చుట్టు రక్షణ కంచె లేకపోవటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు దిమ్మె కూలిపోయే ప్రమాదం ఉంది. అదేవిధంగా రక్షణ కవచం లేకపోవటంతో ప్రమాదకరంగా మారింది. చిన్నారులకు అందేంత ఎత్తులో ఫ్యూజ్ బాక్స్ కూడా మూత తెరిచి ప్రమాదకరంగా ఉంది. సంబంధిత ఎలక్ట్రికల్ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు నూతన దిమ్మె నిర్మించటమే కాకుండా చుట్టూ రక్షణ కవచం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె, మూతతెరిచి ఉన్న ఫ్యూజ్ బాక్స్